క్లుప్తంగా

డయాలసిస్ వార్డు పరిశీలన



డయాలసిస్ వార్డును పరిశీలిస్తున్న మంత్రి ఆర్కేరోజా

నగరి : స్థానిక ఏరియా ఆస్పత్రిలో సిద్ధమవుతున్న డయాలసిస్ వార్డును మంత్రి ఆర్కే రోజా మంగళవారం పరిశీలించారు. డయాలసిస్‌కు తగిన విధంగా ఇప్పటికే గదిని సిద్ధం చేసినట్లు వైద్యులు ఆమెకు చెప్పారు. అవసరమైన యంత్రాలు చేరడంతోపాటు టెక్నీషియన్స్ కూడా ఉన్న నేపథ్యంలో త్వరితగతిన వార్డును ప్రారంభించి, రోగులకు వైద్యసేవలు అందివ్వాలని వైద్యులను ఆదేశించారు.

నేడు చింతలగుంటలో జల్లికట్టు

వెదురుకుప్పం : మండలంలోని చింతలగుంట దళితవాడలో బుధవారం జల్లికట్టు జరిపించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. మంగళవారం వారు మాట్లాడుతూ ఈమేరకు పకడ్బందీ ఏర్పాట్లు చేస్తున్నట్లు వెల్లడించారు.

పెనుమూరులో విద్యుత్ అదాలత్ నేడు

చిత్తూరు కార్పొరేషన్: వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం బుధవారం పెనుమూరులో విద్యుత్ అదాలత్ నిర్వహించనున్నట్లు ట్రాన్స్‌కో డీఈ పద్మనాభపిళ్లై తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారుల గ్రీవెన్స్ చైర్మన్, విశ్రాంత న్యాయమూర్తి శ్రీనివాస ఆంజనేయమూర్తి, సభ్యులు రామ్మోహన్, అంజనీకుమార్ ఈశ్వరమ్మ పాల్గొంటారన్నారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 1.30 వరకు అదాలత్ జరుగుతుందని వివరించారు.

జగనన్నతోనే జీడీ నెల్లూరు అభివృద్ధి



నారాయణరెడ్డి

వెదురుకుప్పం : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలోనే జీడీ నెల్లూరు నియోజకవర్గం అభివృద్ధి జరిగిందని వైఎస్సార్‌సీపీ బూత్ కమిటీ కన్వీనర్ బోడిరెడ్డి నారాయణరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ టీడీపీ నేత థామస్ ప్రజలను మభ్యపెట్టే మాటలు చెబుతున్నారని ఆరోపించారు. డిప్యూటీ సీఎం నారాయణస్వామి చెప్పిన మాట ప్రకారం చెరువుల అనుసంధానానికి రూ.180 కోట్లు మంజూరు చేయించారని, నాలుగు చెరువు పనులు కూడా పూర్తి చేయించారన్నారు. కార్వేటినగరంలో 50 పడకల ఆస్పత్రిని అభివృద్ధి చేశారని వెల్లడించారు. నియోజకవర్గంలో మొత్తం 140 ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం చేపట్టారని, అందులో 100 పూర్తి చేశారని వివరించారు. థామస్‌కు ఎలాంటి రాజకీయ పరిజ్ఞానం లేదని, అహంకారని విమర్శించారు.

ఘర్షణ కేసులో నిందితుడికి రెండేళ్ల జైలు



నిందితుడిని జైలుకు తరలిస్తున్న కానిస్టేబుల్

నగరి: ఘర్షణ కేసులో నిందితుడికి రెండేళ్ల జైలు శిక్ష పడింది. పోలీసుల కథనం..మండలంలోని రామాపురంలో వ్యవసాయ భూముల వద్ద కొంతకాలం క్రితం ఘర్షణ చోటుచేసుకుంది. ఘర్షణలో ఒకరిని తీవ్రంగా గాయపరచిన గ్రామస్తుడు ఆర్.వెంకటేశ్ (49)పై అప్పట్లో కేసు నమోదైంది. కేసు తుదివిచారణలో ఇది నిరూపితం కావడంతో జడ్జి విష్ణువర్మ అతడికి రెండేళ్ల జైలుశిక్షతో రూ.3500 జరిమానా విధించారు. ఏపీపీ రామశాంతి ఈ కేసును వాదించారు. కోర్టు కానిస్టేబుల్ నవీన్‌కుమార్, సీఐ బీఎస్ సురేష్ నిందితుడిని చిత్తూరు జైలుకు తరలించారు.

నిరుద్యోగ ద్రోహి చంద్రబాబు

పూతలపట్టు : నిరుద్యోగులకు భృతి ఇస్తామని మోసం చేసిన ద్రోహి చంద్రబాబు అని వైఎస్సార్‌సీపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు హేమంత్‌రెడ్డి ఆరోపించారు. మంగళవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో అబద్ధపు హామీలతో గద్దెనెక్కి అన్నీ విస్మరించారన్నారు. అందుకే 2019 ఎన్నికల్లో ప్రజలు తగిన బుద్ధి చెప్పారని తెలిపారు. యువత మరోసారి చంద్రబాబును నమ్మే పరిస్థితి లేదని స్పష్టం చేశారు. అందుకే జీడీ నెల్లూరులో టీడీపీ అధినేత నిర్వహించిన సభకు ప్రజలు ముఖం చాటేశారని తెలిపారు. రాబోయే ఎన్నికల్లో జగనన్ననే మళ్లీ ముఖ్యమంత్రిగా గెలిపించుకునేందుకు ప్రతి ఒక్కరూ సిద్ధంగా ఉన్నారని వెల్లడించారు.

గాంధీ మండపం మార్పుపై కసరత్తు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయ భిక్షాల గాలిగోపురం వద్ద ఆర్యవైశ్యుడు చలమయ్యశెట్టి నిర్మించిన గాంధీ బొమ్మ మండప స్థల మార్పుపై మంగళవారం పాలకమండలి చైర్మన్ అంజూరు తారకశ్రీనివాసులు శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు కసరత్తు చేశారు. ప్రస్తుతం ఉన్న గాంధీబొమ్మ ఉన్న స్థలం వద్ద వాహనాల మండపం నిర్మిస్తున్న నేపథ్యంలో గాలిగోపురం ఎడమవైపు చివరి భాగాన ఆలయ నిధులతో నిర్మించేందుకు పరిశీలించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ వాహన మండప నిర్మాణ పనులు 75శాతం పూర్తయ్యాయని, గోపురం పక్కన మండపం నిర్మించి అక్కడ గాంధీ బొమ్మను ఏర్పాటు చేస్తామన్నారు. ఇందుకు అధికారులు, నాయకులు సహకరించాలన్నారు. ఆలయ అధికారులు శివకిషోర్, డీఈ లలిత తదితరులు పాల్గొన్నారు.

సిద్ధం పోస్టర్లను విడుదల చేస్తున్న మంత్రి ఆర్కేరోజా, నాయకులు



ఎన్నికలకు సిద్ధం

– మంత్రి ఆర్కే రోజా

నగరి: ఎన్నికలు ఎప్పుడువచ్చినా విజయఢంకా మోగించడానికి తాము సిద్ధంగా ఉన్నామని మంత్రి ఆర్కేరోజా అన్నారు. మంగళవారం తన క్యాంప్ కార్యాలయం వద్ద నియోజకవర్గస్థాయి సమావేశం నిర్వహించి 'సిద్ధం' పోస్టర్లను విడుదల చేసి ఆమె మాట్లాడారు. గత టీడీపీ ప్రభుత్వంలా బూటకపు హామీలు ఇచ్చి ప్రజలను ఏమార్చలేదని, ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో పాటు ఇవ్వని పలు హామీలు నెరవేర్చిన ఘనత తమ పార్టీదేనన్నారు. అమలు చేసిన సంక్షేమం, చేసిన అభివృద్ధే తమ బలం.. బలగమన్నారు. దీనికి తోడు వీర సైనికుల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పటిష్ఠంగా ఉన్నాయన్నారు. ప్రజారంజకమైన పాలనతో జగనన్న ప్రజల గుండెల్లో ఉన్నారని, హామీలు నెరవేర్చడంతో వచ్చిన మనోధైర్యం అండగా ఉందని, పార్టీ అణువంత నష్టం జరిగినా దాన్ని ఎదుర్కొనే పటిష్ఠమైన పార్టీ శ్రేణులున్నాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో నియోజకర్గస్థాయి పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆర్థికాభివృద్ధితో సాధికారత

నగరి: మహిళలందరూ ఆర్థికాభివృద్ధి సాధించి సాధికారతతో ముందుకు పోవాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని పర్యాటక శాఖా మంత్రి ఆర్కే రోజా అన్నారు. మంగళవారం నగరి దేశమ్మ ఆలయ షాపింగ్ కాంప్లెక్స్‌లో రూ.2 లక్షలతో ఏర్పాటు చేసిన పేపర్ ప్లేట్ యూనిట్‌ను ఆమె ప్రారంభించి మాట్లాడారు. మెప్మా ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ యూనిట్ మంచి లాభాలను ఆర్జించాలని ఆకాంక్షించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారనేలా స్ఫూర్తి రగిలించేలా యూనిట్ పని చేయాలని సూచించారు. అలాగే ప్రభుత్వ ప్రోత్సాహకాలను అందిపుచ్చుకుని మహిళలు తమదైన శైలిలో అభివృద్ధికి పర్యాయంగా నిలవాలన్నారు. కార్యక్రమంలో రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఆర్కే సెల్వమణి, మెప్మా అధికారులు పాల్గొన్నారు.



పేపర్ ప్లేట్ యూనిట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి రోజా

నేత్రానందం..అఖండ దీప ప్రజ్వలనం

- వాస్తుహోమ పూజల్లో మంత్రి ఆర్కేరోజా
- అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

నగరి: నేత్ర ప్రదాయిని దేశమ్మ అమ్మవారి నూతన ఆలయ అష్ట రజిత మహాకుంభాభిషేక ఉత్సవాల్లో భాగంగా రెండవరోజైన మంగళవారం అఖండ దీప పూజ, వాస్తుహోమం, మహా ధ్వజస్థాపనం కార్యక్రమాలు నేత్రానందంగా సాగాయి. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, యువజన సర్వీసుల క్రీడాశాఖ మంత్రి ఆర్కేరోజా పతీ సమేతంగా పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వారికి ఆలయ మర్యాదలతో పాటు సాంస్కృతిక నృత్యకళాకారుల నృత్యాలతో ఆలయ కమిటీ చైర్మన్ వేణుబాబు, ఈఓ రామచంద్రయ్య స్వాగతం పలికారు. సాంప్రదాయబద్ధంగా పూజా సామగ్రితో వచ్చి అఖండ దీప పూజలకు, హోమ పూజలకు వాటిని అందజేశారు. కుంభాభిషేకోత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన మంగళవాయిద్యాలు, డప్పు వాయిద్యాలు, కోలాటాలు, గ్రామీణ నృత్యాలు, బసవ నృత్యాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. హోమపూజలనంతరం మంత్రి మాట్లాడుతూ, గ్రామ దేవత నేత్ర ప్రదాయినిగా దేశమ్మ దేవత ఆలయం నిర్మించే భాగ్యం అమ్మవారు తనకు కల్పించారని, అది ప్రజల ఆశీస్సులతో తనకు లభించిన అవకాశమన్నారు. వారికి ఎప్పుడూ రుణపడి ఉంటానన్నారు. కార్యక్రమంలో రాయలసీమ వీవర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్కే సెల్వమణి, ఆలయ కమిటీ సభ్యులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.



పూజా సామగ్రితో ఆలయానికి వస్తున్న మంత్రి దంపతులు



అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

తాగు నీటి సమస్య పరిష్కారం



తాగునీటి బోరును ప్రారంభిస్తున్న దృశ్యం

శ్రీరంగరాజపురం : వేసవిలో ప్రజలు ఇబ్బంది పడకుండా ఎస్‌ఆర్ పురంలో సర్పంచ్ హరిత సుమారు రూ.7లక్షల వ్యయంతో తాగునీటి బోరు వేయించారు. మంగళవారం ఈ మేరకు మోటారు ఏర్పాటు చేసి నీటి సరఫరా ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ డిప్యూటీ సీఎం నారాయణస్వామి సహకారంతో తాగునీటి సమస్య పరిష్కరించినట్లు వెల్లడించారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకే ప్రజలు అండగా నిలవాలని పిలుపునిచ్చారు.

భూసార పరీక్షలు తప్పనిసరి



సమావేశంలో మాట్లాతున్న వైస్ ఎంపీపీ శేఖర్‌యాదవ్

పాలసముద్రం : పంటల సాగుకు ముందు రైతులు తప్పనిసరిగా భూసార పరీక్ష చేయించాలని ఏఓ ఢిల్లీ ప్రసాద్ తెలిపారు. మంగళవారం శ్రీకావేరిరాజుపరం ఆర్‌బీకేలో రైతులకు మట్టి నమూనా సేకరణపై అవగాహన కల్పించారు. ఏఓ మాట్లాడుతూ పొలం ఆరోగ్య స్థితిగతులను భూసార పరీక్ష ద్వారా తెలుసుకోవచ్చన్నారు. పొలంలో సేకరించిన మట్టికి తిరుపతిలోని భూసార పరీక్ష కేంద్రంలో టెస్ట్ చేసి ఫలితాలు అందిస్తామని వెల్లడించారు. వైస్ ఎంపీపీ శేఖర్‌యాదవ్ మాట్లాడుతూ ఆర్‌బీకేల్లో రైతులకు కావాల్సిన ఎరువులు, పురుగు మందులు, విత్తనాలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గాలి మహేష్‌బాబు, సుబ్రమణ్యంరెడ్డి పాల్గొన్నారు.

గెస్ట్ లెక్చరర్ పోస్టులకు దరఖాస్తు

వెదురుకుప్పం : మండలంలోని చవటగుంటలో ఉన్న డాక్టర్ వైఎస్సార్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గెస్ట్ లెక్చరర్ పోస్టులకు అర్హులైనవారు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ అన్నపూర్ణ శారద కోరారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ కామర్స్, హిస్టరీ సబ్జెక్టులకు సంబంధించి అధ్యాపక పోస్టులు ఖాళీగా ఉన్నట్లు తెలిపారు. ఆసక్తి గలవారు 13వ తేదీ సాయంత్రం 5 గంటలలోపు దరఖాస్తులు సమర్పించాలన్నారు. పీజీ, యూజీసీ నెట్, సెట్ విద్యార్హత ఉన్నవారు అర్హులని వెల్లడించారు. పీహెచ్‌డీ చేసిన వారికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు పేర్కొన్నారు. దరఖాస్తు చేసుకున్నవారు 14వ తేదీ మధ్యాహ్నం 2 గంటలకు నిర్వహించే ఇంటర్వ్యూకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో హాజరుకావాలని చెప్పారు. ఇతర వివరాలకు 6302500965, 9912868469 నంబర్లలో సంప్రదించాలన్నారు.

బదిలీ కాని 'భవిష్య నిధి'

- యాక్సిస్ బ్యాంకులో చిక్కుకున్న జీపీఎఫ్ సొమ్ము
- 310 మంది ఉద్యోగులకు చెందిన రూ.కోటికి పైగా నగదు
- పట్టించుకోని మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు



చిత్తూరు మునిసిపల్ కార్పొరేషన్ కార్యాలయం

చిత్తూరు అర్బన్: బ్యాంకు నుంచి మనం తీసుకున్న రుణం చెల్లించాల్సిన తేదీ కంటే ఒక్కరోజు ఆలస్యంగా కడితే నానా యాగీ చేస్తుంటారు. ముక్కుపిండి మరీ వసూలు చేసేస్తారు. అలాంటిది ఉద్యోగులకు రావాల్సిన నగదును మాత్రం ఎలాంటి కారణం లేకుండా బ్యాంకులోనే ఉంచేసుకున్నారు. వివరాలు.. చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో పనిచేస్తున్న 310 మంది ఉద్యోగులకు సంబంధించిన జీపీఎఫ్ నిధులపై ప్రస్తుతం అయోమయ పరిస్థితి ఏర్పడింది. ఉద్యోగులకు గ్రూప్ ప్రావిడెంట్ ఫండ్ (జీపీఎఫ్) నిధులు దాదాపు రూ.కోటికి పైగా నగరంలోని యాక్సిస్ బ్యాంకులో ఉండిపోయాయి. ఉద్యోగుల ఖాతాలను బ్యాంకు నుంచి రద్దు చేసినా నగదు ఇవ్వడంలో బ్యాంకు అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారు. చట్టపరమైన చర్యలు తీసుకుని ఉద్యోగుల పక్షాన నిలబడాల్సిన మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు చోద్యం చూస్తున్నారు.

ఏంటీ వివాదం..?

చిత్తూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో అధికారులు, సిబ్బంది, పారిశుద్ధ్య కార్మికులు, ఇంజినీరింగ్ సిబ్బంది మొత్తం ఉద్యోగులకు ప్రతీ నెలా వారి మూల వేతనం నుంచి 10–14 శాతం చొప్పున జీపీఎఫ్‌ను రికవరీ చేస్తారు. ఈ మొత్తాన్ని 2013 నుంచి 2022 డిసెంబరు వరకు చిత్తూరులోని యాక్సిస్ బ్యాంకులో జమ చేస్తూ వచ్చారు. నెలకు సగటున రూ.5 లక్షల వరకు ఉద్యోగుల జీపీఎఫ్ నిధులను బ్యాంకులో వేశారు. అయితే జీపీఎఫ్ నగదు తమ బ్యాంకులో ఉంచుకోవడం కుదరదంటూ 2022 డిసెంబరు తర్వాత యాక్సిస్ బ్యాంకు అధికారులు ఉద్యోగుల ఖాతాలను ఫ్రీజ్ చేశారు. దాదాపు తొమ్మిదేళ్ల పాటు ఉద్యోగుల జీపీఎఫ్ నిధులను బ్యాంకులో ఉంచుకున్నందుకు వడ్డీతో సహా తిరిగి చెల్లించాల్సిన బ్యాంకు అధికారులు ఇప్పటి వరకు చిల్లిగవ్వ కూడా ఇవ్వలేదు. ఒక్కో ఉద్యోగికి రూ.లక్షల్లో బకాయిలు రావాల్సి ఉంది. బ్యాంకు తమ సొమ్ము చెల్లించకపోవడంపై ఉద్యోగులు ఆందోళన చెందుతున్నారు.

పట్టించుకోరా..!

ఈ వ్యవహారంపై కార్పొరేషన్ అధికారులు బ్యాంకు నిర్వాహకులకు ఓ లేఖ రాశారు. ఉద్యోగుల జీపీఎఫ్‌ను మరో బ్యాంకులో చెల్లించడానికి అందరి పేరిట ఖాతాలు కూడా తెరిపించారు. కానీ ఒక్క రూపాయి నూతన బ్యాంకు ఖాతాలో జమ చేయలేదు. యాక్సిస్ బ్యాంకు నుంచి రావాల్సిన నగదును తెప్పించడంలో మున్సిపల్ యంత్రాంగం విఫలమైందనే చెప్పాలి. వాస్తవానికి నెలనెలా ఉద్యోగుల పేరిట చెల్లించిన జీపీఎఫ్ సొమ్ము తిరిగి చెల్లించకపోతే బ్యాంకు నిర్వాహకులపై చీటింగ్ కేసు పెట్టడం, రిజర్వు బ్యాంక్ ఆఫ్ ఇండియాకు, సెబీకు రాత పూర్వక ఫిర్యాదు చేయడం జరగాలి. కానీ కార్పొరేషన్ అధికారులు మాత్రం ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. బ్యాంకు అధికారులతో ఏమైనా కుమ్మక్కయ్యారా..? అని ఉద్యోగులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

ఇప్పటికీ రికవరీ చేస్తూనే..

మరోవైపు యాక్సిస్ బ్యాంకు నుంచి జీపీఎఫ్ నిధులు తెప్పించలేకపోతున్న మున్సిపల్ అధికారులు ఇప్పటికీ తమ ఉద్యోగుల నుంచి నెలనెలా జీపీఎఫ్ రికవరీ చేస్తూనే ఉన్నారు. ఈ మొత్తాన్ని కొత్తగా ఓపెన్ చేసిన ఖాతాల్లో జమ చేయకుండా మున్సిపల్ ఖజానాలో జమ చేస్తున్నారు. రికవరీ చేసిన మొత్తం కార్పొరేషన్ ఖజానాలో ఉంచుకుంటే ఉద్యోగులకు వడ్డీ రాదు.. అదే బ్యాంకులో జమ చేస్తే కనీస వడ్డీ లభిస్తుందనే విషయాన్ని అధికారులు మరచిపోవడం విస్మయానికి గురిచేస్తోంది. దీనిపై మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయ మేనేజర్ ఉమామహేశ్వరరెడ్డి స్పందిస్తూ.. '' జీపీఎఫ్ నగదు ఇచ్చేయమని ఇప్పటికే బ్యాంకు అధికారులకు లెటర్ పెట్టాం. నేరుగా వెళ్లి మాట్లాడాం. కానీ వాళ్లు స్పందించడం లేదు. బ్యాంకు యాజమాన్యంపై చట్టపరంగా చర్యలు తీసుకోవడానికి కమిషనర్‌తో మాట్లాడుతున్నాం..'' అని తెలిపారు.

క్యాన్సర్‌పై అవగాహన అవసరం



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

పాలసముద్రం : క్యాన్సర్‌పై అవగాహన అవసరమని వైద్యాధికారి మోహన్‌కృష్ణ తెలిపారు. మంగళవారం స్థానిక పీహెచ్‌సీలో ఆశ నోడల్ అధికారి సుశీల, సూపర్‌వైజర్ మురళి ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. మోహన్‌కృష్ణ మాట్లాడుతూ మహిళల్లో అధికంగా రొమ్ము, థైరాయిడ్, గర్భాశయ క్యాన్సర్లు వస్తున్నట్లు వెల్లడించారు. 40 ఏళ్లు దాటిన మహిళలు అనుమానం వస్తే సమీపంలోని క్యాన్సర్ ఆస్పత్రికి వెళ్లి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. ఈ క్రమంలోనే శరీరంపై స్పర్శలేని మచ్చలు ఉన్నవారిని గుర్తించి లెప్రసీ టెస్ట్ చేయాలని కోరారు. ఈ మేరకు క్షేత్రస్థాయిలో ఆరోగ్య కార్యకర్తలు అవగాహన కల్పించాలని ఆదేశించారు. అనంతరం ర్యా లీ నిర్వహించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ జ్ఞానశేఖర్ పాల్గొన్నారు.

ఐక్యతతోనే సమస్యల పరిష్కారం



సమావేశంలో మాట్లాడుతున్న విశ్రాంత సైనికుడు

పాలసముద్రం : ఐక్యతతోనే సమస్యల పరిష్కారం సాధ్యమని విశ్రాంత సైనికులు అఫూన్ రాజ్, ధనకృష్ తెలిపారు. మంగళవారం తిరుమశరాజుపురం దళితవాడలో విశ్రాంత సైనికుల సమావేశం నిర్వహించారు. చిత్తూరు, గంగాధర నెల్లూరు డివిజన్ యూనియన్ విశ్రాంత సైనికులు మాట్లాడుతూ ఆర్మీలో ప్రాణాలు పణంగా పెట్టి విధులు నిర్వర్తించినా, ప్రభుత్వం నుంచి రావలసిన బెనిఫిట్స్ సక్రమంగా అందడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగ సమయంలో వివరాలు సక్రమంగా నమోదు చేయకపోవడం వల్ల చాలా మంది విశ్రాంత సైనికులు ఇబ్బంది పడుతున్నారని వెల్లడించారు. యూనియన్‌గా నిలబడితే అన్ని సమస్యలను సులువగా పరిష్కరించుకోవచ్చని సూచించారు.

వైభవంగా ఏకాదశి ఉత్సవం



ఊరేగింపులో స్వామి, అమ్మవార్లు

నారాయణవనం: మండల కేంద్రంలో టీటీడీ అనుబంధ ప్రముఖ శ్రీపద్మావతీ సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ఏకాదశిని పురస్కరిం చుకుని ప్రత్యేక పూజలు చేశారు. సాయంత్రం ఉత్సవర్లు మాడవీధి ఉత్సవంలో భక్తుల నుంచి హారతులు అందుకున్నారు. ఉదయం సుప్రభాత సేవతో ఆలయాన్ని తెరచి నిత్యపూజా కైంకర్యాలను నిర్వహించారు. ఏకాదశి గడియల్లో అర్చనలు చేశారు. సాయంత్రం శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వేంకటేశ్వరస్వామి ఉత్సవమూర్తులను సర్వాంగ సుందరంగా అలంకరించి పూజలు చేశారు. ఉత్సవర్లను తిరుచ్చి వాహనంపై కొలువుదీర్చి, మాడవీధుల్లో ఊరేగించారు. అడుగడుగునా భక్తులు కర్పూర నీరాజనాలు సమర్పించారు. ఆలయానికి చేరుకున్న ఉత్సవర్లకు ఆస్థానం నిర్వహించి నైవేద్య సమర్పణ చేశారు. ఆర్జితం అధికారి భరత్ ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

9న 'నులి' నివారణకు సన్నద్ధం



బంగారుపాళెం: మాట్లాడుతున్న డాక్టర్ లోహిత్‌చెంగల్‌రాయన్

తవణంపల్లె : జాతీయ నులిపురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఈ నెల 9వ తేదీన 19 ఏళ్ల పిల్లలందరితో ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలని వైద్యాధికారి ప్రియాంక తెలిపారు. మంగళవారం తవణంపల్లె పీహెచ్‌సీలో ఆశా డే నిర్వహించారు. ప్రియాంక మాట్లాడుతూ చేతులు శుభ్రం చేసుకోవడంపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని సూచించారు. పీహెచ్‌సీల్లో కాన్పులు చేయించాలని కోరారు. పిల్లలకు విధిగా టీకాలు వేయించాలని స్పష్టం చేశారు. అనంతరం నులి పురుగుల నివారణ దినోత్సవం పోస్టర్ విష్కరించారు. కార్యక్రమంలో పీహెచ్‌ఎన్ భారతి, హెల్త్ సూపర్‌వైజర్లు శ్రీహరి, నిర్మల, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాసులు పాల్గొన్నారు.

చైతన్యవంతం చేయాలి

బంగారుపాళెం: పిల్లల్లో నులిపురుగుల నివారణపై ప్రజలను చైతన్యవంతం చేయాలని వైద్యాధికారి లోహిత్‌చెంగల్‌రాయన్ కోరారు. మంగళవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆరోగ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. నులిపురుగుల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు ఎప్పుడు వేయాలి, ఎలా వేసుకోవాలనే విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్లు లోకేష్, రమేష్, ఎంపీహెచ్‌ఈఓ రమేష్‌బాబు, డీపీఎంఓ మణి, సీహెచ్ఓ షమీమ్‌బేగం, సూపర్‌వైజర్లు హరికృష్ణ, అముద పాల్గొన్నారు.



తవణంపల్లె : మాట్లాడుతున్న వైద్యాధికారి ప్రియాంక

లక్ష్యం అధిగమించాలి

యాదమరి: ఆల్బెండజోల్ మాత్రల పంపిణీలో నిర్దేశిత లక్ష్యాన్ని అధిగమించాలని వైద్యాధికారి అనిల్ కుమార్ నాయక్ ఆదేశించారు. మంగళవారం యాదమరి ప్రభుత్వాసుపత్రిలో ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. పీహెచ్‌సీ పరిధిలోని అన్ని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లోని పిల్లలతో ఆల్బెండజోల్ మాత్రలు మింగించాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్ఓ లక్ష్మీ నారాయణ పాల్గొన్నారు.

చీడపీడల నివారణతో నాణ్యమైన దిగుబడి



పంటను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖాధికారులు

బంగారుపాళెం: పంటల సాగులో చీడపీడలను నివారణతోనే నాణ్యమైన దిగుబడి వస్తుందని డీఆర్‌సీ ఏడీఏ శివశంకర్ తెలిపారు. మంగళవారం మండలంలోని టేకుమంద, మొగిలివారిపల్లెలో రైతులు సాగు చేస్తున్న వివిధ పంటలను వ్యవసాయాధికారులు పరిశీలించారు. చీడ పీడల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై రైతులకు అవగాహన కల్పించారు. వరిలో జింక్ లోపం అరికట్టేందుకు 2గ్రాముల చిలేట్‌జింక్‌ను లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. మిరపలో ఆకుముడత నివారణకు డైమిథోయేట్ 2 గ్రాములు, లేదా ఫిప్రోనిల్ 1.6 మి.లీని లీటరు నీటిలో కలిపి పిచికారీ చేస్తే మంచి ఫలితం ఉంటుందని సూచించారు. ఆర్‌బీకే సిబ్బంది క్షేత్ర స్థాయిలో పంటలను పరిశీలిస్తుండాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఏఓ చిట్టిబాబు, విస్తరణాధికారులు సాదరయ్య, చంద్రిక పాల్గొన్నారు.

15న చీరల వేలం

చిత్తూరు రూరల్: నగరంలోని గిరింపేటలో వెలసిన దుర్గాంబ ఆలయంలో అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలు, జాకెట్లను వేలం వేయనున్నట్లు ఈఓ మునిశేఖర్ తెలిపారు. ఈనెల 15వ తేదీన ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఆసక్తిగలవారు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనవచ్చని సూచించారు.